## శ్రీ గాయత్రీ టెక్నో లో ఘనంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు




బయ్యారం, ,(గౌతమ్ న్యూస్): మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం ఈ నెల 26 న శ్రీ కృష్ణ జన్మాష్టమి పండుగను పురస్కరించుకుని మండలంలోని గందంపల్లి లోని శ్రీ గాయత్రీ టెక్నో ది ఇంగ్లీష్ మోడల్ స్కూల్ నందు శనివారం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులు ఉట్టి కొట్టి సంబరాలు జరుపుకున్నారు. బాలికలు గోపిక వేషధారణలో కనువిందు చేశారు. బాలురు కృష్ణుని వేషధారణలో వేణుగానం వినిపిస్తూ కోలాటం,నృత్యంతో అలరించారు. పాఠశాల కరస్పాండెంట్ రాజశేఖర్ విద్యార్థులను అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ మన సంస్కృతి, సాంప్రదాయాలు మరిచి పోరాదని,ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకత,ఉత్సాహంపెంచుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. విద్యార్థులు క్రమశిక్షణ తో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించే విధంగా భవిష్యత్తుమార్చుకోవాలని చెప్పారు. ఈకార్యక్రమంలోప్రిన్సిపాల్,ఉపాధ్యాయులు శ్రీనివాస్,చంద్రమౌళి, జీవిత,హర్షిత,భువనేశ్వరి,శిరీష,మంజుల, చమిలి,రేణుక మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.





## జస్ట్ ఫర్ లివింగ్ సొసైటీ 11వ వార్షికోత్సవం

### జస్ట్ ఫర్ లివింగ్ సొసైటీ నిర్వహకులు గండి సీతారాం గౌడ్



మానుకోట/డోర్నకల్(గౌతమ్ న్యూస్): సహాయం చేయడం మా వంతు, పిల్లలు చదువుకోవడం వంతు అని జస్ట్ ఫర్ లివింగ్ సొసైటీ నిర్వహకులు గండి సీతారాం గౌడ్ అన్నారు. శనివారం డోర్నకల్ మండలంలోని వెన్నారం గ్రామ ఎంపీయుపిఎస్ పాఠశాలలో జస్ట్ ఫర్ లివింగ్ సొసైటీ 11వ వార్షికోత్సవం సందర్భంగా వందమంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్టేషనరీ, సామాగ్రి పంపిణీ, చేసి కేక్ కట్ చేయడం జరిగింది. అనంతరం విద్యార్థులకు మంచి రుచికరమైన భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంఈఓ పూల్ చంద్, మాజీ సర్పంచ్ బోయినపల్లి వెంకన్న, ప్రధానోపాధ్యాయులు బి.సురేష్, నరసింహారావు, నోడల్ ఆఫీసర్ లక్ష్మ, ఉపాధ్యాయులు కృష్ణ ప్రసాద్, కవిత, సక్రాం, వివేక్, రాములు, గౌస్య, హాజర, రమేష్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## యూత్ కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలో చెరుకుపల్లి నరేందర్ ని గెలిపించండి



బయ్యారం(గౌతమ్ న్యూస్): నేటి యువతకు వారి గొంతుకు చెరుకుపల్లి నరేందర్ ప్రాతినిధ్యం వహించేందుకు రాజకీయలలోనికి మీ ముందుకు మీ ఆశీస్సులతో రాబోతున్నాడు అతను మాస్టర్ అఫ్ బిజినెస్ అప్లికేషన్ స్టడీస్ లో పట్టా పొంది ఒక చిత్తశుద్ధి ఉన్న రాజకీయ యువ నాయకుడిగా ఎదగాలని,సామాన్యుల పక్షాన వారి సమస్యలపై గట్టిగా పోరాడాలని. పేదలు, బడుగు బలహీన వర్గాల వారు, రైతులు, మహిళలు,అణగారిన వర్గాల వారికి మరింత దగ్గరగా ఉండాలని అతని ఆలోచన. బయ్యారం మండలంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ పిలుపులో భాగంగా ఇల్లందు నియోజకవర్గ యూత్ అధ్యక్షుడిగా చెరుకుపల్లి నరేందర్ పోటీ చేస్తున్నారు,మంచి నాయకత్వం లక్షణాలు కలిగిన నరేందర్ మీ అమూల్యమైన ఓటు సీరియల్ నెంబర్ 7 పై నొక్కి అఖండ మెజారిటీతో గెలిపించాలని ,కాంగ్రెసు నాయకులను మండల యువతను నరేందర్ కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ప్రధాన భూమిక పోషించింది యువతేనని నేడు నిర్వహిస్తున్న ఈ యువజన కాంగ్రెస్ ఎన్నికలలో యువతకు అద్భుతమైన అవకాశం వచ్చింది. ఆ అవకాశాన్ని అందిపుచ్చుకొని విజయం సాధించి అంచలంచలుగా ఎదగాలని,అలాగే యువత రాష్ట్రానికి,దేశానికి సేవ చేయాలని కాంగ్రెస్ పార్టీ కీర్తి ప్రతిష్టలు పెంచాలని అయన కోరారు. నాపై నమ్మకం ఉంచి ఇల్లందు నియోజకవర్గ యూత్ అధ్యక్షుడిగా పోటీ చేసే అవకాశం కల్పించిన కాంగ్రెస్ పార్టీ పెద్దలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానని,పార్టీ కోసం కష్టపడ్డ వారిని కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు వదులుకోదని వారికి తగిన గుర్తింపు ఏదో ఒక దశలో కల్పిస్తూనే ఉంటుందని తెలియజేశారు. మన దేశం యువ భారతదేశం. దేశంలో, రాష్ట్రంలో అత్యధికంగా యువకులే ఉన్నారని నేడు యువత ఉద్యోగ పరంగా వృత్తిపరంగా, అనేక సమస్యలు ఎదుర్కొంటుందని ఆ సమస్యలను, పరిష్కార దిశగా కృషి చేస్తానని వారన్నారు,యువత పెద్ద ఎత్తున యూత్ కాంగ్రెస్ ఓటింగ్ లో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

## ద్విచక వాహనం ఢీకొని వ్యక్తి మృతి



టేకులపల్లి (గౌతమ్ న్యూస్): తొమ్మిదో మైలు గ్రామానికి చెందిన తేజావత్ దంజ్య తండ్రి మాన్ సింగ్ 68 వృత్తి వ్యవసాయం నిన్న రాత్రి 8 గంటల సమయంలో 9 మైళ్ళకు చెందిన తోలేం సుధాకర్ తన ద్విచక్ర వాహనం అతివేగంతో డి కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి గాయపడిన వ్యక్తిని హుట హూటిన ఇల్లందు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ నిన్న మరణించారు మృతుని కుమారుడైన తేజవత్ అమర్ సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టేకులపల్లి ఎస్సై పి సురేష్ తెలిపారు

## ఎసెన్షియా ప్రమాదంలో మృతుల కుటుంబాలకు వైసిపి ఆర్థిక సహాయం..!



**అమరావతి,:** ఎసెన్షియా ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు పార్టీ తరపున 5 లక్షలు.. గాయపడ్డ వారికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం ప్రకటించింది వైసీపీ. పార్టీ అధ్యక్షుడు ఆదేశాల మేరకు ఎక్కడ బాధితులు వుంటే అక్కడ స్థానిక నాయకత్వం ఆర్థిక సహాయం అందజేస్తుంది అని బొత్స సత్యనారాయణ అన్నారు. ఇక అనకాపల్లిలో బాధితుల పరామర్శకు వచ్చి జగన్ చేసిన సూచనలపై ప్రభుత్వంలో వున్న వాళ్ళు ఇష్టారీతిన మాట్లాడుతున్నారు. అయితే జగన్మోహన్ రెడ్డి మీద స్థాయి మరిచిపోయి చేస్తున్న విమర్శ లు అన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారు రాళ్ళు విసిరితే కాచుకోవడానికి మేము సిద్ధం. కానీ బాధ్యతలు మరిచిపోయి వ్యవహరించవొద్దని విజ్ఞప్తి చేస్తున్నాను అని అన్నారు. వైఫల్యాలను ప్రశ్నిస్తే ఎదురుదాడి చేస్తున్నారు. పరిహారం చెల్లింపులో ఆలస్యం జరిగితే ధర్నా చేస్తామని జగన్మోహన్ రెడ్డి అన్నారు.. ఫ్యాక్టరీ యాజమాన్యం కనిపించడం లేదని ప్రభుత్వం చెప్పడం ఏంటి.. వాళ్ళు ఎక్కడ వున్న పట్టుకుని లాక్కరావలసిన బాధ్యత ప్రభుత్వానికి వుంది. ప్రతిపక్ష పార్టీగా ఖచ్చితంగా ప్రజల పక్షాన పోరాడతాం అని బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు.

# ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్న పోషకాహార లోపం

### సస్పెన్షన్లు, బలవంతపు రాజీనామాలు తగవు

### సీసీజీజీఓఓ జాతీయ చైర్మన్ వి. కృష్ణ మోహన్

హైదరాబాద్ (గౌతమ్ న్యూస్): తాజాగా ప్రకటించిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ఫలితాలు ప్రభుత్వానికి అసంతృప్తిని కలిగించి ఆ నివేదికను రూపొందించిన ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ పాపులేషన్ సైన్సెస్ డైరెక్టర్ సస్పెన్షన్‌కు దారి తీసింది. ఇకపై నివేదికల్లో రక్తహీనత అనే పదమే కనిపించకూడదని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2011-12, 2017-18 మధ్యకాలంలో దేశంలో దారిద్ర్య రేఖకు దిగువన నివసిస్తున్న జనాభా శాతం పెరిగిందని జాతీయ శాంపిల్ సర్వే కార్యాలయం వెల్లడించింది. దీంతో ఆ నివేదిక ప్రచురణను ప్రభుత్వం నిలిపి వేసింది. గణాంక వివరాలు బహిర్గతం కావడానికి కారకులనే నెపంతో ఇద్దరు స్టాటిస్టిషియన్లను బలవంతంగా తమ ఉద్యోగాలకు రాజీనామా చేయించటాన్ని కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ గెజిటెడ్ ఆఫీసర్స్ ఆర్గనైజేషన్స్ (సీసీజీజీఓఓ) జాతీయ చైర్మన్ వి. కృష్ణ మోహన్ తప్పుబట్టారు. ఆహారం సరిగా లభించక పోవడం వల్లనే కరువు కాటకాలు సంభవించడం లేదని, సామాజిక, ఆర్థిక అంశాలు కూడా దానికి దోహద పడుతున్నాయని తెలిపారు. రానున్న కాలంలో పౌష్టికాహార లోపం కుటుంబాల ఆర్థిక వనరులపై ప్రభావం చూపబోతోందని, వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా భవిష్యత్‌లో ఆహార భద్రతకు అనేక సవాళ్లు ఎదురవుతాయని హెచ్చరించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు కేవలం ఆహార ధాన్యాలను మాత్రమే అందిస్తున్నారు తప్పించి అవసరమైన పప్పు ధాన్యాలు మొదలైన నిత్యావసరాలు సరఫరా చేయడం లేదు. ఫలితంగా ప్రజల్లో పోషకాహార లోపం ఏర్పడింది.

### అందుబాటులో లేని ఆరోగ్యకరమైన ఆహారం

ఆహార భద్రత, పోషకాహారంపై 2011లో ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఏఓ) ఓ పరిశీలన ప్రారంభించింది. భారతదేశంలోని జనాభాలో 74.1 శాతం మందికి ఆరోగ్యకరమైన ఆహారం అందడం లేదని అది తేల్చింది. గతేడాది విడుదలైన ప్రపంచ ఆకలి సూచికలో భారత్ 111వ స్థానంలో (మొత్తం 125 దేశాల్లో) నిలిచింది. ఈ సూచికలో ప్రతి ఏటా మన ర్యాంకింగ్ పడిపోతూనే ఉంది. 2016లో 97, 2017లో 100, 2018లో 103, 2022లో 107%% ఇలా మన ర్యాంక్ పతనమవుతూనే ఉంది. హైతీ, సబ్-సహారా ఆఫ్రికాలోని 12 దేశాలు మాత్రమే మన కంటే తక్కువ ర్యాంకులో ఉన్నాయి. దేశంలో ఐదేండ్ల కంటే తక్కువ వయసున్న ప్రతి ముగ్గురు చిన్నారుల్లో ఒకరు తక్కువ బరువును, 36 శాతం మంది తక్కువ ఎత్తును కలిగి ఉన్నారని 2019-21 జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే తెలిపింది.



వయసుకు తగినట్టు బరువు, ఎత్తు లేకపోవడం పోషకాహార లోపానికి సూచికలు. 19 శాతం మంది పిల్లలైతే ఎత్తుకు తగిన బరువు లేక పీలగా ఉన్నారు. ఇది కూడా పోషకాహార లోపం సూచికే. 2019-21లో దేశ జనాభాలో 36 శాతం మంది కుంగుబాటుకు లోనయ్యారు. 19 శాతం మంది అసాధారణ రీతిలో బలహీనంగా ఉన్నారు. 6-59 నెలల మధ్య వయసున్న పిల్లల్లో 67 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారు. పెద్ద వారిలో అంటే 15-49 ఏండ్ల మధ్య వయస్కుల్లో 57 శాతం మహిళలు రక్తహీనతకు గురయ్యారు.

### సౌకర్యాల కొరతతో వృథా

దేశంలో తృణధాన్యాల ఉత్పత్తి పెరుగుతున్నప్పటికీ ఆహారధాన్యాల తలసరి లభ్యత తగ్గిపోతోంది. 1991లో ఒక్కో వ్యక్తికి రోజుకు 510.1 గ్రాముల ఆహార ధాన్యాలు అందుబాటులో ఉండగా 2021లో 507.9 గ్రాములు మాత్రమే లభించాయి. వివిధ కారణాల వల్ల వ్యవసాయోత్పత్తుల్లో 40 శాతం వరకూ నష్టపోవాల్సి వస్తోంది. కోల్డ్ స్టోరేజీ సౌకర్యాలు లేకపోవడంతో పండ్లు, పాలు వంటి 1.3 బిలియన్ టన్నుల సరుకులను నష్ట పోవాల్సి వస్తోంది.

### వ్యవసాయోత్పత్తిపై వాతావరణ మార్పుల ప్రభావం

2020-2050 మధ్యకాలంలో దేశ జనాభా 0.82 శాతం వార్షిక వృద్ధి రేటు సాధిస్తుందని అంచనా. అంటే శతాబ్దం మధ్య నాటికి దేశ జనాభా 172,33,80,000కు చేరుతుంది. ఇందుకనుగుణంగా తృణధాన్యాలు, పప్పు ధాన్యాలు, ఆహార ధాన్యాలు, కూరగాయలు, పాలు, మాంసం, గుడ్ల ఉత్పత్తి సగటున ఏటా వరుసగా 2.65 శాతం, 4.9 శాతం, 2.84 శాతం, 4.65 శాతం, 4.58 శాతం, 11.57 శాతం, 5.82 శాతం మేర పెరగాలి. వాతావరణ మార్పులు సంభవిస్తే ఉత్పత్తిపై ప్రభావం పడవచ్చు. ఉదాహరణకు 2021లో 113 మిలియన్ టన్నుల గోధుమలు ఉత్పత్తి కాగా 2022లో 107 టన్నుల ఉత్పత్తి మాత్రమే జరిగింది. ఈ ఏడాది అది మరింత పడిపోయి 105 మిలియన్ టన్నులకు చేరుతుందని అంచనా. గతేడాదితో పాటు ఈ ఏడాది కూడా బియ్యం ఉత్పత్తి పడిపోయింది. అందుకే బాసుమతియేతర బియ్యం ఎగుమతులను కేంద్రం నిలిపివేసింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా పంటల ఉత్పత్తి తగ్గిపోతే దాని ప్రభావం ఆకలిపై పడుతుంది. 2050 నాటికి ఆకలితో బాధపడే వారి సంఖ్య 11 నుంచి 20 శాతం వరకూ పెరగవచ్చునని ఓ నివేదిక తెలిపింది. దేశంలో 2022 నుండి తీవ్రమైన వడగాల్పులు సర్వసాధారణమై పోయాయి. వాతావరణ మార్పులే దీనికి కారణం. 1900-2018 మధ్యకాలంలో దేశంలో సగటు వార్షిక ఉష్ణోగ్రత 0.7 డిగ్రీలు పెరిగింది.

### ఉత్పత్తి పెంపు అనివార్యం

జనాభా అవసరాలకు అనుగుణంగా వ్యవసాయోత్పత్తులు పెరగకపోతే ఎగుమతులను తగ్గించుకోవడంతో పాటు నిత్యావసరాలను మరోసారి దిగుమతి చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడవచ్చు. ఈ పరిణామం మన విదేశీ వాణిజ్యంపై ప్రభావం చూపుతుంది. మనం ఇప్పటికే పప్పులు, వంటనూనెలను పెద్ద ఎత్తున దిగుమతి చేసుకుంటున్నాము. బియ్యం, గోధుమల ఎగుమతులపై విధించిన నిషేధం కారణంగా భారత్ అంతర్జాతీయంగా విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఓ అంచనా ప్రకారం జనాభా అవసరాలను తీర్చాలంటే 2030 నాటికి 311 టన్నులు, 2050 నాటికి 350 టన్నుల ఆహార ధాన్యాలను మన దేశం ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది. అందుకోసం ఉత్పాదకతనైనా పెంచాలి లేదా సాగు భూమినైనా పెంచాలని వి. కృష్ణ మోహన్ సూచించారు.

### అడుగంటుతున్న భూగర్భ జలాలు

వివిధ కారణాలతో దేశంలో 147 మిలియన్ హెక్టార్ల భూమి ఇప్పటికే సారాన్ని కోల్పోయింది. వాతావరణ మార్పులు అగ్నికి ఆజ్యం పోస్తున్నాయి. ఈ నేపథ్యంలో 2050 నాటికి వ్యవసాయ యోగ్యమైన భూమిలో సగం బీడుగా మారిపోయే ప్రమాదం ఉంది. అంతిమంగా అది ఉత్పాదకత తగ్గడానికి దారితీస్తుంది. భూమిలో లవణాలు పేరుకుపోతున్నాయని, ఫలితంగా ఆహార భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉన్నదని, ఆర్థికాభివృద్ధి దెబ్బ తింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. పదేండ్ల క్రితం%% అంటే 2012-14లో వేసిన ఓ అంచనా ప్రకారం భూమిలో లవణాలు పేరుకు పోవడంతో అప్పటికే 16.84 మిలియన్ టన్నుల వ్యవసాయోత్పత్తులకు నష్టం చేకూరింది. పులి మీద పుట్రలా జల వనరుల లభ్యత కూడా తగ్గిపోతోంది. జనాభాతో పాటు నీటి వినియోగం కూడా పెరగడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. హరిత విప్లవ కాలం నుంచి నీటి వినియోగం అధికంగా ఉండే పంటలనే రైతులు పండిస్తున్నారు. దేశంలో లభ్యమవుతున్న భూగర్భ జలాలలో 89 శాతం వ్యవసాయానికే ఖర్చవుతున్నాయి. అందుకే 2007-2017 మధ్యకాలంలో భూగర్భ జల మట్టం 61 శాతం పడిపోయింది. భవిష్యత్తులో ఆకలి కేకలు నివారించేందుకు ప్రభుత్వం వాస్తవాలను కప్పిపుచ్చే బదులు సర్వే ఫలితాల ఆధారంగా దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని, అంతే గాని నివేదికను రూపొందించిన ఆఫీసర్లను సస్పెండ్ చేయటం, బలవంతంగా రాజీనామాలు చేయించటం మానుకోవాలని ప్రధాన మంత్రికి వి. కృష్ణ మోహన్ విజ్ఞప్తి చేశారు.

# బిచ్చగాళ్ళు.... ఒక మాఫియా



హైదరాబాద్ (గౌతమ్ న్యూస్): మనకు ప్రయాణంలో దారెంబడి చాలామంది బిచ్చగాళ్ళు కనిపిస్తుంటారు. ముఖ్యంగా ది సిగ్నల్స్ దగ్గర , గుడుల వద్ద, తీర్థయాత్రల్లో , బస్టాండ్లల్లో చాలామంది బిచ్చగత్తెలు ఒడిలో ఓ పసిబిడ్డలతో కనిపిస్తుంటారు. మీరు బాగా గమనిస్తే తరుచూ మన ఇండ్ల ముందుకు వచ్చే బిచ్చగత్తెలు కూడా ఓ బిడ్డను ఎత్తుకునే వస్తుంటారు .. ఇట్లా బిడ్డల్ని ఎత్తుకున్న బిచ్చగత్తెలనే చూస్తున్నాం కానీ కడుపుతో ఉన్న బిచ్చగత్తెలు కొండొకచో తప్ప మనకు ఎక్కువగా కనిపించరు. వీళ్లకు గర్భంతో ఉన్నప్పుడు ఇంట్లోనే ఉండి విశ్రాంతి తీసుకునే అవకాశం లేదు. ఒకవేళ ఉంటే " పచ్చి బాలింతనమ్మ "అంటూ అడుక్కునేందుకు వాళ్ళు బయటకు రారు. అదేవిధంగా బిచ్చగాళ్ళ కుటుంబాల్లో చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేస్తారు. 30 ఏళ్ల వయసు వచ్చేసరికి వాళ్లకు 15 - 16 ఏళ్ల పిల్లలు ఉంటారు. కానీ ఒక్కోసారి మనకు 50 ఏళ్ల బిచ్చగత్తె కూడా పసిబిడ్డని ఎత్తుకొని బాలింతరాలిని అని మభ్యపెట్టే ప్రయత్నం చేస్తుంది. ఇది పచ్చి మోసం. ఇంకో విషయం... బిచ్చగాళ్ళ ఒడిలో ఉండే పిల్లల రూపు రేఖలు పరిశీలించండి. సదరు బిచ్చగాళ్లకు ఆ పసిపిల్లల పోలికలకు పొంతనే కుదరదు. ఇదే అక్కడ ఉన్న మోసం.

### పసి బిడ్డలకు మత్తు ఇస్తారు

మరో విషయం కూడా మీరు గమనించండి...మన ఇండ్లలో చిన్నపిల్లలు అదేపనిగా పెద్ద వాళ్ళని సతాయిస్తుంటారు..ఏ పని చేసుకోనివ్వరు నిలబడినివ్వరు కూర్చోనివ్వరు. కానీ బిచ్చగాళ్ళ ఒడిలో ఉన్న పిల్లలు మాత్రం ప్రతి ఒక్కరు నిద్రపోతూనే ఉంటారు. ఇందుకు కారణం ఆ పిల్లలకు ఒకటి రెండు చుక్కల గంజాయిని అందిస్తారు. లేదా పంక్చర్‌లు వేసే గమ్(మత్తు కలిగిస్తుంది) వాసన చూపి పడుకోబెడతారు.. మత్తు ఏదైనా ఆ మత్తుకు ఆ పిల్లలు గంటల తరబడి అట్లాగే పడుకుంటారు . ఇదంతా తర్వాత కాలంలో ఇది వాళ్ళ మెదడు మీద విష ప్రభావం చూపించే అవకాశం ఉన్నది. అంతే కాదు ఆ పసి మెదళ్ళు ....శరీరాలు ...ఆ మత్తును తట్టుకోలేక నిద్రలోనే మరణించే అవకాశం కూడా ఉన్నది. పసిపిల్లల మరణాల గురించి బిచ్చగాళ్లకు బాధ లేదు. గంజాయి మత్తులోనే పిల్లలు కన్ను మూసినా కూడా దుఃఖం లేదు. ఎందుకంటే ఆ పిల్లలను ఒక సానుభూతిగా చూపెట్టి డబ్బు సంపాదించుకోవడం ఒక్కటే వాళ్ళ లక్ష్యం. ఒకరు పోతే మరొకరిని తెచ్చుకుంటారు. ఏదో ఒక సంవత్సరం కాదు... ఏడాదుల పొడవునా పసిపిల్లల్ని ఎత్తుకొని అడుక్కుంటూ ఉంటారు.

### ఎక్కడెక్కడ...ఏ విధంగా ఎత్తుకొస్తారు?

రైల్వే స్టేషన్లలో, రాత్రులు రైలు ప్రయాణాల్లో , బస్టాండ్లలో, పుణ్యక్షేత్రాల్లో, పసి బిడ్డల దొంగతనాలు ఎక్కువగా జరుగుతుంటాయి. రైల్వే విషయానికి వస్తే సాధారణ భోగిల్లోకే కాదు.... స్లీపర్ రిజర్వేషన్ భోగిల్లోకి కూడా ఈ బిచ్చగాళ్ళు అర్ధరాత్రులు జలబడుతుంటారు. చడి చప్పుడు చేయకుండా పిల్లల్ని ఎత్తుకుపోయి తమ అవసరాలకు వాడుకుంటారు.. ఇతర రద్దీగా ఉండే స్థలాల్లో, పెండ్లిళ్లలో, జాతర్లలో, కూడా పసిపిల్లల్ని ఎత్తుకుపోతుంటారు. పిల్లల్ని ఆ విధంగా కోల్పోయిన తల్లిదండ్రుల వేదన అంతా ఇంతా కాదు. పిల్లల కోసం జీవితాంతం వెతుకుతూనే ఉంటారు..తిరిగి వస్తారని ఆశ పడుతూనే ఉంటారు.. చస్తూ బతుకుతుంటారు. ప్రతి ఒక్క బిచ్చగత్తె ఒడిలో ఉన్న బిడ్డ ఎత్తుకు వచ్చిందే అని చెప్పలేము. కానీ చాలావరకు బిచ్చగాళ్ళ ఒడిలో ఉన్న పసిబిడ్డలు ఎత్తుకు వచ్చిన పిల్లలే అని మాత్రం కచ్చితంగా చెప్పగలము. అవును! బిచ్చగాళ్ళ ఒడిలో కనిపించే పసిపిల్లలు చాలావరకు దొంగతనంగా ఎత్తుకొచ్చిన పిల్లలు. ఈ బిచ్చగాళ్ళ తతంగం మన పెద్దలకు తెలియంది కాదు..కాబట్టి మన పసిబిడ్డల్ని పదేండ్ల వయసు వరకు పువ్వు కంటే సుకుమారంగా చూసుకోవాలని పెద్దలు చెప్తుంటారు. ఇందు కోసం కాయించుకుని కొన్ని కథలు కూడా హెచ్చరికగా చెబుతుంటారు.ఇక పసిబిడ్డలకు ఒక వయసు వచ్చిన తర్వాత కూడా ఆ బిడ్డలు వాళ్లకు సంపాదించే యంత్రాలే. ఆ ఆ పిల్లల ఒడిలో పసి పిల్లల్ని పెట్టి ఎదుటి వాళ్ళ జాలిని పొందడం కోసం ప్రయత్నం చేస్తుంటారు. వీళ్లల్లో కొందరి పోలికలు చూస్తుంటే స్థితిమంతుల పిల్లలుగా అర్థమవుతుంది. కానీ దురదృష్టం చేసుకొని బిచ్చగాళ్ళల్లో కలిసి పోయారు.

### బాడుగకు పిల్లలు

కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలను బాడుగకు యిస్తారు. ఆ యిచ్చే తల్లిదండ్రులు కటికదరిద్రులు. కాబట్టి తాము అడుక్కోలేక, వేరే పనులు చేసుకుంటూ...పైగా డబ్బొస్తుందని వీళ్ళకు అద్దెకు ఇచ్చి తమ పిల్లల ఆరోగ్యాన్ని తమ చేజేతులా నాశనం చేయడానికి కారకులవుతున్నారు.

### ఎత్తుకొచ్చిన పిల్లల పరిస్థితి

దొంగతనంగా ఎత్తుకొచ్చిన పిల్లలు వాళ్ళ సొంత పిల్లలు కాదు కాబట్టి, ఆడపిల్లకైతే లైంగిక భద్రత ఉండదు. తాను పెరుగుతున్న ఇంట్లోనే లైంగిక వేధింపులకు గురవుతుంటారు . ఒక వయసు వచ్చాక ఈ ఆడపిల్లల్ని అమ్ముకుంటారు..లేదంటే వావి వరస లేకుండా తామే పెళ్లి చేసుకుంటారు.మగ పిల్లలకి కూడా భద్రత ఉండదు. బిక్షాటనలో తమకు సంపాదన ఎక్కువగా రావడం కోసం మగ పిల్లల్ని అవిటి వాళ్లుగా కూడా మార్చే అవకాశం కచ్చితంగా ఉన్నది. మీరు బాగా చూడండి కాళ్లు చేతులు లేని వాళ్లుగా మగపిల్లలే చాలామంది కనిపిస్తుంటారు .

### ప్రభుత్వాల చొరవ

భిక్షాటన రద్దు చేయాలని ప్రభుత్వాలు ప్రయత్నం చేస్తున్నప్పటికీ అది రెండు రోజుల ముచ్చటగానే కనిపిస్తున్నది.. కొద్ది రోజులు కనుమరుగైపోయి తర్వాత మళ్లీ వాళ్ల దారిలో వాళ్లే నడుస్తున్నారు.. భారతదేశంలో బిచ్చగాళ్లకు కొదవ లేకుండా పోతున్నది. ఈ బిచ్చగాళ్లకు వసతులు కల్పించిన కూడా వాటిని వినియోగించుకునే పరిస్థితిలో వాళ్ళు లేరు. కష్టపడకుండా తేరగా సంపాదించుకునే మార్గానికి పూర్తిగా అలవాటు పడ్డారు.

### బిచ్చగాళ్ళ సంపాదన

బిచ్చగాళ్లు రోజుకు మూడు వేల నుండి 4 వేల రూపాయల సంపాదిస్తున్నారనేది ఒక అంచనా. ఈ సంపాదన కేవలం అడుక్కోవడంతో వచ్చేది మాత్రమే. ఇది చాలా సార్లు రుజువు అయింది కూడా. ఇక మిగతా వ్యాపకాల వల్ల వచ్చే సంపాదన అదనంగా ఉంటుంది. ఈ సంపాదనని కొందరు బిచ్చగాళ్ళు అధిక మొత్తలకు వడ్డీగా కూడా ఇస్తుంటారు. వచ్చిన చిల్లర దుకాణదారులకు వందకు పది రూపాయల కమిషన్ తో కూడా ఇచ్చుకుంటారు.

### గజదొంగలు

బిచ్చగాళ్లు పసిపిల్లల దొంగలు మాత్రమే కాదు. ఇండ్లల్లో జొరబడే గజదొంగలు కూడా. చిక్కు వెంట్రుకలు కొనుక్కునేవాళ్లుగా, మాట్లేసే వాళ్లుగా, కొందరి దొంగలు ప్లాస్టిక్ బిందెలు అమ్మేవాళ్లుగా , ఇంకా రకరకాల వేషాలతో పగలంతా రెక్కీ నిర్వహిస్తుంటారు. ఒంటరి మహిళల్ని, తాళం వేసిన ఇండ్లను,టార్గెట్ చేస్తుంటారు. బయట పసిపిల్లల ఏడుపులా టేప్ రికార్డర్లు ఉంచి... తలుపులు తీస్తే చాలు సడన్గా దాడి చేసి హత్యలకు కూడా తెగబడుతుంటారు.

### స్మగ్లర్లు

ప్రస్తుతం యువతను పట్టిపీడిస్తున్న డ్రగ్స్ మాఫియాలో కూడా ఈ బిచ్చగాళ్లకు సంబంధం ఉన్నది . వీళ్ళు మత్తు పదార్థాలు సరఫరా చేసే స్మగ్లర్లుగా వ్యాపారాలుగా కూడా పనిచేస్తున్నారు. ఐస్క్రీములు అమ్మే డబ్బాలు పెట్టుకొని...., అర్ధరాత్రులు నడిరోడ్డు మీద , మూల మలుపుల దగ్గర, సినిమా థియేటర్ల దగ్గర, బస్టాండ్ దగ్గర అడ్డా చేసుకొని నిలబడి వ్యాపారం కొనసాగిస్తుంటారు.

### బిచ్చగాళ్లకు ఉండే లక్షణాలు :

మనం బిచ్చగాళ్లు అనుకుంటాం. కానీ వెళ్ళు కొన్ని అరుదైన లక్షణాలను కలిగి ఉంటారు.

1.వేగంగా పరిగెడతారు. 2. ఆడవాళ్లు మగవాళ్లు ఇద్దరూ పరుగెత్తి ఎత్తయిన గోడల్ని కూడా ఎక్కి దుంకగలరు. 3. స్వార్థం ఒక్కటే ఉంటుంది. మానవత్వం తక్కువ. 4. అధునాతన డోర్ లాకులు కూడా చాకచక్యంగా తీయగలరు. 5. జ్ఞాపక శక్తి, గ్రహణ శక్తి ఎక్కువగా ఉంటుంది. 6. సరైన కుటుంబాలు ఉండవు. 7. వీళ్లకు చదువు ఒకటే రాదు.. అన్ని విషయాల్లో టంకు టమారా గాళ్ళు.

### చైల్డ్ వెల్ఫేర్ కమిటీ

child welfare committee చైల్డ్ వెల్ఫర్ కమ్యూటీ ,స్టేట్ కమీషన్ పిల్లల హక్కుల పరిరక్షణ కమిటీల నుండి పలుమార్లు బిచ్చగాళ్ళ మీద ఎంక్వయిరీలు జరిగాయి. బండారం బయటపడి కేసులు అయ్యాయి. ఎత్తుకువచ్చిన చిన్న పిల్లలను గవర్నమెంట్ హోంకు తరలించడం జరిగింది. ఇటువంటి సంఘటనలు ఎదురైనప్పుడు బిచ్చగాళ్లు అప్రమత్తంగా ఉంటారు. పరివర్తన వచ్చినట్టుగా కనిపిస్తారు. కానీ ఇదంతా నాటకం.మప్పించి మళ్లీ మొదలెడుతారు. ఏ తల్లి కన్న బిడ్డలో బిచ్చగాళ్ళ చేతిలో పడి జీవితాలను కోల్పోతున్నారు. తల్లిదండ్రుల చాటున సంతోషంగా బాధ్యతగా పెరగాల్సిన పిల్లలు... వీధిపాలవుతున్నారు. ఏ బిడ్డను ఎక్కడినుండి తెచ్చుకుంటారో సరైన చిరునామాలు ఉండవు. ఇండ్ల వద్ద నుండి ఎత్తుకు వస్తే చిరునామాలు ఉంటాయి కానీ, వివిధ ప్రదేశాల్లో ఎత్తుకు వచ్చే పిల్లలు ఆచూకీ గురించి సరైన సమాచారం ఉండదు. అటువంటి పిల్లల గురించి తల్లిదండ్రుల నుండి కేసు నమోదు అయితే, అదే సమయంలో వీళ్లు పట్టుబడితే, కష్టసాధ్యంగా పిల్లల్ని సొంతగూటికి చేర్చవచ్చు. కానీ ఇలాంటి విషయాలపైన శ్రద్ధ తీసుకునే యంత్రాంగం కూడా మన దగ్గర లేదు.

### స్వచ్ఛంద సంస్థల్ని కూడా మోసం చేస్తారు :

కొన్ని స్వచ్ఛంద సంస్థలు మానవతా దృక్పథంతో బిచ్చగాళ్లను చేరదీయాలని, బిచ్చగాళ్ళ వ్యవస్థను నిర్మూలించాలని ప్రయత్నం చేస్తుంటాయి. ఆ సమయానికి బిచ్చగాళ్లు మారినట్టుగా నటిస్తారు. కొన్నాళ్లు ఏమారుస్తారు. ఆ తరువాత మళ్లీ తమ పాతదారుల్లోనే ప్రయాణిస్తారు.

### జాలి చూపించే పరిస్థితి లేదు

పాపం పేదవాళ్లు సరిగ్గా తిండి ఉండదేమో అనుకోవడానికి కూడా వీల్లేదు. ఇష్టం వచ్చిన ఆహారం హాయిగా తింటారు . గ్రామాల్లో కోళ్లను చాకచక్యంగా దొంగతనం చేసి మరీ తింటారు. వీళ్ళు కోళ్లను దొంగతనం చేసే ఒక విధానం గమనిస్తే... తిండి గింజల్ని కోళ్లు ఉన్న చోటు నుండి దారెంబడి పోసుకుంటూ వెళ్తారు. ఆ గింజల్ని మేస్తూ కోళ్లు ఆ దారెంబడి వస్తాయి. మాటేసి ఆ కోళ్లను బిచ్చగాళ్లు పట్టేస్తారు.

### జాగ్రత్త అవసరం

మొత్తానికి.....

ప్రపంచంలో జరుగుతున్న అనేక ఘోరాల్లో మోసాల్లో పసిపిల్లల దొంగతనం కూడా ఒక మోసం గా జరుగుతున్నది. పిల్లలు లేని వాళ్ళ పిల్లల్ని ఎత్తుకుపోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. బిచ్చగాళ్ళు ఎత్తుకుపోయిన సంఘటనలు మాత్రం చాలా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇదంత ఒక సమాచారంగా జాగ్రత్త కోసం నేను ఇక్కడ పోస్ట్ చేస్తున్నాను. ఈ మాఫియాని పట్టించడానికి ఎవ్వరూ సాహసం చేయరు. దొరికినప్పుడు మాత్రమే ఇటువంటి బిచ్చగాళ్లు శిక్షించబడుతుంటారు. లేదంటే తమ కార్యకలాపాలు యధేచ్చగా కొనసాగిస్తుంటారు. ఇటువంటి పరిస్థితుల్లో మీరు ఏ ఫంక్షన్ కి వెళ్ళినా ఏ కార్యక్రమానికి వెళ్లిన ఏ గుడికి వెళ్ళినా ఏ గోపురానికి వెళ్లిన పిల్లల్ని జాగ్రత్తగా చూసుకోండి. మీ పిల్లల అందమైన అదృష్టవంతమైన జీవితాన్ని కాపాడుకోండి..

